క్లుప్తంగా

టెన్త్ ప్రశ్నాపత్రాలకు పటిష్ట భద్రత



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాక్సుల్లో భద్రంగా ప్రశ్నాపత్రాలు

సీతమ్మధార: మరో రెండు రోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వాటి ప్రశ్నాపత్రాలకు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పటిష్ట భద్రత కల్పించారు. ప్రశ్నాపత్రాల బాక్స్‌లకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్, మధురానగర్ స్కూల్‌తోపాటు ఇతర పాఠశాలలకు సంబంధించిన పరీక్ష ప్రశ్నాపత్రాలను ఇక్కడ భద్రంగా ఉంచారు. పరీక్షలు ప్రారంభమయ్యే ముందు వాటిని తెరుస్తారు. అంతవరకు పోలీస్‌ల పర్యవేక్షణలో ఉంటాయి.

43వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో శనివారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పర్యటించారు. సంఘం ఆఫీస్, యలమంచిలివారి వీధి, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్యం అమలు ఏ విధంగా ఉందో స్థానికులను అడిగి ఆమె తెలుసుకున్నారు. పారిశుధ్యం సరిగా లేదని, కుళాయిల నుంచి తాగునీరు కొద్దిగా వాసనతో వస్తోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉషశ్రీ స్పందిస్తూ శానిటేషన్ సూపర్‌వైజర్‌తో మాట్లాడి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. వాటర్ వర్క్స్ ఏఈతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల నిరసన

మద్రిపాలెం: చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు, ప్రగతిశీల మహిళా మండలి కార్యదర్శి లక్ష్మి అన్నారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీ ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద మాధవ చిల్లర వర్తకుల సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆర్ అండ్ బీ జంక్షన్‌లో ఎన్నో ఏళ్లుగా బడ్డీకొట్ల ద్వారా చిరువ్యాపారులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని గుర్తు చేశారు. నగరంలో జీ20 సదస్సు నెపంతో బడ్డీలను తొలగించారని తెలిపారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ బడ్డీకొట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని లక్ష్మి హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వయోలిన్ కచేరీ



వయోలిన్‌పై కృతులు ఆలపిస్తున్న దుర్గాభవాని

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నెలవారీ సంగీత కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ బీవీకే కళాశాలలో శనివారం జరిగిన సంగీత కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ముందుగా కుమారి ముగ్ధ గాత్రంతో ప్రారంభించి చక్కని రాగాలాపన, స్వరకల్పనతో అలరించింది. గాయత్రి వరేణ్య వయోలిన్‌పై, ఎస్.కార్తీక్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. తర్వాత విజయవాడకు చెందిన దుర్గాభవాని వయోలిన్ కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సావేరి వర్ణ రాగంతో కచేరీ ప్రారంభించి, బంటురీతి హంసనాదం, మరివేరేగతి ఆనందభైరవి, ఇంత సౌఖ్యమని కాఫీ రాగంలో కృతులు ఆలాపన, స్వరకల్పనతో కచేరీ రక్తి కట్టించారు. వీరికి పి.విజయభాస్కర్ మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై వాద్య సహకారం అందించారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకుడు నిష్టల కృష్ణవేణి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భయపెడుతున్న జంక్షన్లు



హైవేపై ప్రమాదాలకు నిలయంగా మారిన సత్యం జంక్షన్

- ప్రమాదాలకు నిలయంగా హైవే కూడళ్లు
- రాత్రి వేళ దూసుకెళ్తున్న వాహనాలు
- కొరవడిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ

సీతమ్మధార: జాతీయ రహదారిలోని పలు జంక్షన్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సత్యం, గురుద్వారా, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మద్రిపాలెం కూడళ్లలో ఏదో ఒక చోట ప్రతి రోజు యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో ఇవి సంభవిస్తున్నాయి. దీంతో ఈ జంక్షన్లు పాదచారులు, వాహన చోదకులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

సత్యం, గురుద్వారా కూడళ్లలో..

హైవేపై సత్యం జంక్షన్ మీదుగా నిత్యం వేల సంఖ్యలో అన్ని రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సీతమ్మధార నుంచి రామాటాకీస్‌కు.. మద్దిలపాలెం నుంచి గురుద్వారాకు, నగరంలో నుంచి గాజువాక, గోపాలపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఇదే రహదారి. నాలుగు వైపులా గందరగోళంగా ఉండే ఈ కూడలిలో ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో.. ఎప్పుడు ఈ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ముఖ్యంగా సత్యం, గురుద్వారా జంక్షన్లలో ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ మీరి సిగ్నల్ జంప్ చేస్తుంటారు. ఆటోలది అదే పరిస్థితి. రాత్రి వేళ మితిమీరిన వేగంతో కొందరు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కూడళ్లలోలో రాత్రి పూట ట్రాఫిక్ పోలీసుల గస్తీ కొరవడింది.

ఇవీ సంఘటనలు..

గతంలో గురుద్వారా, సత్యం, కంచరపాలెం జంక్షన్లలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఎందరో మృత్యువాత పడ్డారు. కొందరు తీవ్రగాయాల పాలయ్యారు. ఇటీవల గురుద్వారా కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మలుపు తిరుగుతున్న సమయంలో సత్యం జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం వైపు అతి వేగంగా వెళ్తున్న కంటైనర్ బస్సును బలంగా ఢీకొట్టింది. లారీ నుంచి రెండు కంటైనర్లు పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. తాజాగా ఈ నెల 23వ తేదీ గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్రాంతంలో కంచరపాలెం జాతీయ రహదారిపై టిప్పర్‌ను గ్యాస్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఐవోసీఎల్ నుంచి ఎన్‌ఏడీ మీదుగా హైవేపై రాయ్‌పూర్ వైపు ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న 18 టన్నుల గ్యాస్ ట్యాంకర్.. కప్పరాడ వద్ద టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌పైకి దూసుకుపోయింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



గురుద్వారా జంక్షన్‌లో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్(ఫైల్)

ట్రాఫిక్ చర్యలు శూన్యం..

ఇలా ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసుల చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. విశాలమైన ఆయా కూడళ్ల వద్ద భద్రతా చర్యలు చేపట్టలేదు. ఏదో ఒక లైన్‌లో వెళ్లి ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీకొనడం, మితిమీరిన వేగంతో వెళ్లి అదుపు తప్పి డివైడర్ల మీదకు దూసుకుపోవడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి దృష్టిలో పెట్టుకొని ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. సత్యం జంక్షన్‌లో రాత్రి 9 గంటల తరువాత ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

హైవేపై గురుద్వారా జంక్షన్‌లో ప్రమాదాల నియంత్రణకు కానిస్టేబుల్‌ను నియమిస్తాం. ఆయా ప్రమాదాలపై పర్యవేక్షిస్తాం. వాహన చోదకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– రామ్మూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ, ద్వారకా పీఎస్

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం



హాజరైన జేసీఎస్ మండల ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు



మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడతారని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో శనివారం జేసీఎస్ మండల ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబుతో పాటు కొన్ని పచ్చ మీడియాలతో కూడా మనం పోరాడుతున్నామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి సచివాలయం కన్వీనర్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో తెలుసుకుని, రాని వారికి అందజేయాలన్నారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, వార్డు అధ్యక్షులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణ స్వర రాగ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో స్వరరాగ గంగా ప్రవాహమే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత వై.ఎస్.రామకృష్ణ పాడిన స్వర రాగ గంగా ప్రవాహమే, శైలజతో కనుపాప కరువైన, సాయి మేఘనతో మురిపించే అందాలే, శివరామకృష్ణ, సాయిమేఘన పాడిన ఓహో మోహన రూపా పాటలు అలరించాయి. నూకల రామ నరసింహం, మేఘన, తుషార నిలయ పాడిన జగదానంద కారక, గంటి రామకృష్ణ, ఉమాగోపాల్ పాడిన హలో హలో ఓ అమ్మాయి, మహమ్మద్ ఖాన్, వీణ పాడిన అమ్మో నీ రేగు పల్లు, సుబ్రహ్మణ్యం పాడిన తిరుమల మందిర సుందర వంటి చక్కని గీతాలు ప్రేక్షకులకు వీనుల విందు చేశాయి. ఎస్.లలిత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సినీ నటుడు ప్రసన్నకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయకులను ఘనంగా సత్కరించారు. ఎస్.ఫణిస్వామి సారథ్యం వహించిన ఈ కార్యక్రమంలో వైద్యుడు ఎస్.ఎ.ఎన్.మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్ ఖాన్, ఆత్రేయ స్మారక కళాపీఠం కార్యదర్శి గంటి మురళి, ఘంటసాల అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా అధ్యక్షుడు సన్‌మూర్తి పాల్గొన్నారు.

రెండు పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వైద్య పరీక్షల ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి, సిబ్బందితో సమీక్షించారు. వైద్య సిబ్బంది డ్రస్ కోడ్ పాటించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ శశిభూషణ్, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించండి

మహారాణిపేట: ఏఎస్సార్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను పరిశీలించారు. వైద్యాధికారి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ–సంజీవనిని తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌డీసీ సర్వే, గర్భిణులకు టీటీ అందజేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రజలను ప్రోత్సహించి అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రస్ కోడ్ పాటించాలని సూచించారు. సందర్శనలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి కార్మిక నాయకులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో ఢిల్లీకి బయలుదేరిన కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్మిక చట్టాల తొలగింపు, కనీస వేతనం, కొత్త పెన్షన్ విధానం రద్దు కనీస మద్దతు ధర వంటి పలు అంశాలపై ఢిల్లీలో ర్యాలీ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



వినియోగదారుల హక్కులపై ప్రసంగిస్తున్న రహీమున్నీసా బేగం

మురళీనగర్: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్త, మోటివేటర్, రిసోర్స్ పర్సన్, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు రహీమున్నీసా బేగం అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. వినియోగదారులు తాము కొన్న ప్రతి వస్తువుకు సంబంధించి రసీదులు తీసుకోవాలన్నారు. ఒక వస్తువును కొన్నప్పుడు దానికి సంబంధించి ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. గరిష్ఠ అమ్మకపు ధర కన్నా ఎవరైనా అధికంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. వినియోగదారులు తాము ఎదుర్కొనే సమస్యలపై వినియోగదారుల హక్కుల ఫోరంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా రహీమున్నీసా బేగంను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

మూడు కొత్త ప్రాజెక్ట్‌ల ఆవిష్కరణ



ఆరుష్ గ్రూప్ రూపొందించిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతంపేట: ఆరుష్ గ్రూప్ శాంతిపురంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మూడు కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వాటిని శనివారం ముఖ్య అతిథులు నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ స్వయం ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని అనుకునే వారికి ఆరుష్ గ్రూప్ ఆవిష్కరించిన మూడు ప్రాజెక్టులు బాగా సహాయ పడతాయన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారిస్తోందని, యువత ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆరుష్ సీఈవో సుభాష్ మాట్లాడుతూ ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్‌టెక్ సమ్మిట్‌లో నాలుగు ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. హెల్త్‌కేర్, ఆరుష్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, అగ్రికల్చర్‌కు సంబంధించి ఎంవోయూలు జరిగాయన్నారు. వచ్చే ఏడాదికి ఆంధ్రప్రదేశ్‌లో కిసాన్ కర్షక మిత్ర ద్వారా సుమారు 2 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వైద్య రంగంలో తాము రూపొందించిన మినీ హెల్త్‌కేర్ కిట్ ద్వారా ఇంటి వద్దే కేవలం 30 నిమిషాల్లో 53 రకాల ఆరోగ్య సమస్యలు గుర్తిస్తామన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. రాబోయే మూడు నెలల్లో నగరంలోని 60 వార్డుల్లో దీనిని ప్రారంభిస్తామన్నారు. 300 మందికి ఉపాధి, 250 మందితో కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

ఆర్‌సీఎల్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ స్పోర్ట్స్: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌సీఎల్ లీగ్ క్రికెట్ పోటీలను పోర్ట్ స్టేడియంలో శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ టోర్నీలో ఏడు జట్లు పాల్గొంటుండగా ప్రారంభ పోటీల్లో తలపడుతున్న ఇరుజట్లను డిప్యూటీ మేయర్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి లీగ్‌ల వల్ల క్లబ్‌ల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పోటీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సమాజ సేవకు ఉపయోగించడం, అంధ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ రాజారెడ్డి, కిషోర్, విశ్వనాథం, మెదిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



రామచంద్రనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. రామచంద్రనగర్, సోనియా గాంధీ నగర్ ప్రాంతాల్లో నివాసుల కోసం సెప్టిక్ ట్యాంక్‌లు పునర్నిర్మిస్తున్నారు. ఈ పనులకు గాను సుమారు రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది రూపస్, కాంట్రాక్టర్ మహేష్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, పైడినాగరాజు, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, దుర్గేష్, సన్ని, నాయుడు, పలిశెట్టి గణపతి, మాతా ఈశ్వరరావు, దుర్గారావు, ఆదిలక్ష్మి, సువర్ణ, తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. స్థానిక పౌరగ్రంథాలయంలో శనివారం సర్పంచుల సంఘం సమావేశం జరిగింది. ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15 వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ వై.నాగేంద్ర మాట్లాడుతూ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా పర్యటించి సర్పంచుల విధులు, అధికారాలపై చైతన్య పరిచేలా పోరాటం చేస్తామని తెలిపారు. పెద్ద సంఖ్యలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఏకాదశి పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం చైత్ర మాస ఏకాదశి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత వెంకన్న స్వామికి సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా పీస్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.లక్ష్మి మాట్లాడారు. అమ్మాయిల్లోని విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

టెన్త్ పరీక్షల్లో తనిఖీ అధికారుల ప్రత్యేక దృష్టి



డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్లెయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లపై ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ప్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లో నియమితులైన అధికారులతో శనివారం క్వీన్ మేరీ హైస్కూల్లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో డీఈవో కార్యాలయం నుంచి డ్యూటీ వేసిన వారు మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల మేనేజ్‌మెంట్ వారు, కరస్పాండెంట్, హెచ్‌ఎం ఎవరూ ఉండటానికి వీల్లేదన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే అవాంతరాలను సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, ఏపీవో అప్పలనాయుడు, భీమరాజు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. సూర్యపికిల్స్, మురుగన్ ఆర్థిక సాయంతో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రితో ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ టెన్త్ విద్యార్థులు

సీతమ్మధార: ఈ నెల 3న జరగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు ప్రశాంతి, లలిత ఆధ్వర్యంలో పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాయనున్న 191 మందికి ప్యాడ్, పెన్, స్కేల్, వృత్తాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. స్టేట్‌లో మొదటి ర్యాంకు సాధించే విద్యార్థులకు రూ.5 వేలు నగదు బహుమతి అందిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. సత్యసాయి సేవా సమితి సభ్యులకు పాఠశాల తరఫున హెచ్‌ఎం రాంప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

ఫిర్యాదు మార్చేశారని మేకప్ ఆర్టిస్ట్ ఆందోళన

సీతమ్మధార: తనపై జరిగిన దాడి విషయమై ఇచ్చిన ఫిర్యాదును మార్చేశారని బాధితుడు ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టాడు. అక్కయ్యపాలెం వివేకానంద హాస్పిటల్ పక్క సందులోనుంచి బుధవారం రాత్రి మేకప్ ఆర్టిస్ట్ అప్పలకొండ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి నగదు లాక్కొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దాన్ని పోలీసులు మార్చి వేసి.. మద్యం తాగి పడిపోయి లేచి చూసే సరికి జేబులో నగదు లేవని చెప్పి ఫిర్యాదు మార్చి రాయించారని ఆరోపించాడు. దారి దోపిడీ కేసును కాస్త చిన్న సెక్షన్ వేసి నిందితులకు స్టేషన్ బెయిల్ వచ్చేలా చేస్తున్నారని అప్పలకొండ అన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ వ్యవహారం పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.